ఇగ్నోలో దరఖాస్తుల ఆహ్వానం

తెలుగుయూనివర్సిటీ, మే 20 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)2024 విద్యా సంవత్సరానికి గాను సర్టిఫికెట్, డిప్లోమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లోమా, డిగ్రీ, పీజీ కోర్సులలో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ బి.రాజగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సులలో చేరడానికి ఇగ్నో పూర్తి ఫీజు రాయితీని కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జూన్ 30వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ పొందవచ్చని, పూర్తి వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ www.ignou.ac.inలో, 9492451812, 040-2311 7550 నంబర్‌లలో సంప్రదించవచ్చని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, మే 20 : వచ్చే విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 3, 5, 8వ తరగతిలో ప్రవేశానికి గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జిల్లాకు చెంది ఉండాలని, కుల, ఆదాయం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు(లేటెస్ట్)తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

అనాథ విద్యార్థులకు ఉచిత విద్య

జూన్ 10 వరకు దరఖాస్తుల ఆహ్వానం

జూబ్లీహిల్స్, మే 20 : పేద అనాథ విద్యార్థులకు ఉచిత విద్య, వైద్య, వసతి సౌకర్యాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చావడి చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ నగరంలోని మియాపూర్ మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌లోని శ్రీ ధర్మపురి క్షేత్రంగా గత 18 ఏండ్లుగా ఈ సేవలను అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు దేవిరెడ్డి రాజ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులలో తల్లిదండ్రులు లేని.. తల్లి లేదా తండ్రి లేని బాలురకు ఈ విద్యాసంస్థలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని.. మరిన్ని వివరాలకు 99085 07383, 81868 67278 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

వానకాలం పంటల సాగుకు యాక్షన్ ప్లాన్

మేడ్చల్, మే 20 (నమస్తే తెలంగాణ) : వానకాలం పంటల సాగుకు యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 28,585 ఎకరాలలో వివిధ పంటల సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు, పండ్ల పంటలు సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో వర్షాలు ముందుగానే పడుతాయనే వాతావరణ శాఖ సూచనల మేరకు పంటల సాగులో రైతులు నిమగ్నం కానున్నారు. ఇప్పటికే వరి కోతలు ముగిసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రధాన పంటల సాగు

పంటలు	విస్తీర్ణం (ఎకరాల్లో..)
వరి	18,900
పత్తి	433
మొక్కజొన్న	1,269
పశుగ్రాస పంట	3,998
కూరగాయలు	2,803
పండ్లు	4,111

అందుబాటులో ఎరువులు

హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రధానంగా పండ్లు, కూరగాయల సాగు పెంచేలా రైతులను సిద్ధం చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా పంటల సాగుకు అవసరమయ్యే ఎరువుల(ఫర్టిలైజర్స్)ను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. యూరియ 2,100మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 2,200, డీఏపీ 1.125, ఏఓపీ 550, ఎస్ఎస్‌పీ 400 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాధికారి మేరీ రేఖ తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20 : తమను రెగ్యులరైజ్ చేసేందుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ అనేక అక్రమాలకు పాల్పడి కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. గత 25 ఏళ్లకు పైగా అతితక్కువ వేతనాలతో పని చేస్తూ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో వీసీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిఏటా రూ.1500 ఇంక్రిమెంట్ చెల్లించేవారని, గతేడాది నుంచి నిలిపివేశారని వాపోయారు. ఈపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వకుండా కోర్టుల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారని, దీని ద్వారా తాము ఎంతో నష్టపోతున్నామని చెప్పారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఓయూలో 'డీబీటీ - బిల్డర్' ప్రైమరీ సెల్ కల్చర్ ల్యాబ్ ప్రారంభం

'డీబీటీ - బిల్డర్' ప్రైమరీ సెల్ కల్చర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20 : ఉస్మానియా యూనివర్సిటీ జెనెటిక్స్ విభాగంలో 'డీబీటీ - బిల్డర్' ప్రైమరీ సెల్ కల్చర్ ల్యాబ్‌ను అధికారులు సోమవారం ప్రారంభించారు. కేంద్రప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ పథకమైన బూస్ట్ టు యూనివర్సిటీ ఇంటర్‌డిసిప్లినరీ లైఫ్ సైన్స్ డిపార్ట్‌మెంట్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ (డీబీటీ - బిల్డర్)కింద ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దీని కింద ఓయూకు ఐదేళ్లకు గాను ఒక ప్రాజెక్టుకు రూ.8.03 కోట్లు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టుకు కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ స్మిత సి.పవార్, కోకోఆర్డినేటర్లుగా ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, ప్రొఫెసర్ కరుణ రూపాల వ్యవహరించనుండగా, మొత్తం వివిధ విభాగాలకు చెందిన 18 మంది అధ్యాపకులు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లుగా పనిచేయనున్నారు. ల్యాబ్‌లో అధునాతన పరికరాలను సమకూర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్సుల గోడ పత్రికను విడుదల చేస్తున్న వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, ప్రొఫెసర్లు

మల్లారెడ్డి యూనివర్సిటీలో.. అలైడ్ హెల్త్‌కేర్ సైన్సెస్ కోర్సులు

మేడ్చల్, మే 20 : విద్యార్థుల ఉన్నతి కోసం అలైడ్ హెల్త్‌కేర్ సైన్సెస్ కోర్సులు ఉపయోగపడుతాయని మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మల్లారెడ్డి యూనివర్సిటీలో అలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ కోర్సులను ప్రారంభించిన సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బైపీసీ చదివిన విద్యార్థుల ఉన్నతిని కాంక్షించి మల్లారెడ్డి యూనివర్సిటీలో మొట్టమొదటి సారిగా అలైడ్ హెల్త్‌కేర్ కోర్సులను ప్రారంభించినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి గ్రాడ్యూయేషన్, పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశం ఉందన్నారు. యూసీ ప్రోగ్రామ్‌లో బీఎస్సీ నాలుగు సంవత్సరాలు అనస్థీషియా అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, మెడికల్ బయో టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ అండ్ క్రిటికల్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, మైక్రో బయోలజీ తదితర కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే పీజీ ఫిజియోథెరపి కోర్సులు, పీహెచ్‌డీలో ఎమర్జెన్సీ, డయాలసిస్ టెక్నాలజీ, రెస్పిరేటరీ థెరపి, హెల్త్ సైకాలజీ తదితర కోర్సులకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

టీఎస్ సెట్ పరీక్షా ఫీజును తగ్గించాలి

సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతి

ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20 : ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ లెవల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) రిజిస్ట్రేషన్ ఫీజును తగ్గించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి ఏబీవీపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జనరల్ కేటగిరీకి రూ.2000, బీసీలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు రూ.1000 వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను స్థానిక భాషలో నిర్వహించాలని, ఫోక్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి సబ్జెక్టులో సైతం పరీక్షను నిర్వహించాలని కోరారు. తమ డిమాండ్లపై సెట్ మెంబర్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు జీవన్, కమల్‌సురేశ్, పృథ్వీతేజ, తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథం చాటుకున్న ఫ్రీమేసన్

- కండరాల బలహీనతతో లేవలేని స్థితిలో ఉన్న వారికి చేయూత
- పిల్లల తల్లికి యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం
- బతికున్నంత కాలం అండగా ఉంటామని బరోసా
- నలుగురు మాతృమూర్తులకు సన్మానం

అబిడ్స్, మే 20 : కండరాల బలహీనతతో మంచంపై నుంచి లేవ లేని స్థితిలో ఉన్న ఇద్దరు పిల్లలను పోషిస్తున్న కుటుంబానికి తెలంగాణ ఫ్రీ మేసన్ సభ్యులు ఆసరాగా నిలిచారు. ఘట్‌కేసర్‌లోని యమ్నాపేట్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి, పద్మ దంపతుల ఇద్దరు కుమారులు తేజ వర్ధన్‌రెడ్డి, మణివర్ధన్‌రెడ్డి కండరాల బలహీనతతో మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్నారు. వారికి తల్లిదండ్రులు అన్ని సపర్యాలు చేయాల్సిన పరిస్థితి. కాగా రోజు కూలీ చేసుకుని జీవించే ఆ కుటుంబానికి పిల్లలను పోషించడంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని గుర్తించిన తెలంగాణ ఫ్రీ మేసన్ సభ్యులు వారికి ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. గోషామహల్ బారాదారిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణలోని ఫ్రీ మేసన్స్ అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్‌లు ప్రొద్దుటూరు వీరభద్రుడు, డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ, అనిల్ దేశాయ్, రమేశ్ మంచాల పాల్గొని పిల్లల తల్లికి యాభై వేల రూపాయల చెక్కును అందజేయడంతో పాటు నెలవారి అవసరానికి అనుగుణంగా కిరాణా సరుకులను అందజేస్తామని హామీ ఇచ్చారు. పిల్లలు జీవించి ఉన్నంత కాలం సరుకుల సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు వీరభద్రుడు మాట్లాడుతూ ఫ్రీ మేసన్స్ ఒక ప్రపంచ సంస్థ అని, విలువలను పెంపొందించే సంస్థ అన్నారు. గత వారం యమ్నాపేట్ గ్రామంలోని పద్మ, నర్సింహారెడ్డిల కుటుంబాన్ని సందర్శించి వారి పరిస్థితిని అధ్యయనం చేసి వారి అవసరాలను అంచనా వేసి ఫ్రీ మేసన్స్ కుటుంబాలు, స్నేహితులు, బంధువులు, వ్యాపార సహచరుల సహకారంతో డబ్బును స్వీకరించి బొక్క పద్మకు చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బొక్క పద్మతో పాటు ప్రముఖ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తల్లి డాక్టర్ సత్యభామ, విమ్లా దుర్వేష్ అహీర్, బోయపాటి సుభాషిణిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్రీ మేసన్ సభ్యులు గన్నారపు అశోక్, ప్రాంతీయ గ్రాండ్ మాస్టర్ టీఎన్ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.



కండరాల బలహీనతతో బాధ పడుతున్న పిల్లల కోసం వారి తల్లి పద్మకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఫ్రీ మేసన్స్ సభ్యులు.

'త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయబాబు, డాక్టర్ చెల్లప్ప తదితరులు

ఖైరతాబాద్, మే 20 : చరిత్రను సంరక్షించుకుంటేనే భావితరాలకు మన అస్తిత్వాన్ని అందించవచ్చని వక్తలు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్, రచయిత శ్రీ రామోజు హరగోపాల్ సంపాదకత్వంలో వెలువరించిన 'త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు' పుస్తకాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం పూర్వ చరిత్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయబాబు, ఎంసీహెచ్‌ఆర్‌డీ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.చెల్లప్ప, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, దక్కన్ ల్యాండ్ పత్రికాధిపతి మణికొండ వేదకుమార్, వారసత్వ శాఖ పూర్వ ఉపసంచాలకులు సముద్రాల శ్రీరంగాచార్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ గతం అనేది మనకు తెలియదని, ఐదువేల సంవత్సరాల నుంచి మాత్రమే మనకు చరిత్ర అందుబాటులో ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసే ప్రయత్నం జరిగిందని గుర్తు చేశారు. ఈ పుస్తకంలో రాణి రుద్రమాదేవి శిల్పం చరిత్రకు సజీవ సాక్షంగా నిలుస్తుందన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ బీవీ భద్రగిరీశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు కట్టా శ్రీనివాస్, వేముగంటి మురళీకృష్ణ, కవి, చరిత్రకారులు తురిమెల్ల శ్రీనివాస ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రకాశం పంతులు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

రవీంద్రభారతి, మే 20 : ప్రకాశం పంతులు ఆశయాలు, ఆలోచనలు స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం ప్రకాశం పంతులు 67వ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ ముందున్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పంతులు మనుమడు టంగుటూరి గోపాలకృష్ణ, టంగూరి శ్రీరామ్, సంస్థ సలహాదారుడు ఎన్.రామచంద్రరావు, వేణుగోపాల చారి, డా.మోహన్‌రావు, రాజశేఖర్, వాణి ప్రసాద్, నిరంజన్ దేశాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రం-వీరం గ్రంథావిష్కరణ

గ్రంథాన్ని ఆవిష్కరించిన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, మే 20 : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్ రచించిన ఉగ్రం-వీరం గ్రంథావిష్కరణ సభ సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని 'ఉగ్రం-వీరం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్ జ్యోత్స్నారాణి, సంగీత గురువు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్‌నగర్ పీఎస్‌ను సందర్శించిన సీపీ

పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్ రెడ్డి

బంజారాహిల్స్, మే 20 : ఫిల్మ్‌నగర్ పీఎస్‌ను నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. కేసుల వివరాలు, దర్యాప్తు విధానం, సిబ్బంది పనితీరును పరిశీలించారు.

డాక్టర్స్ టీ -20 ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణ

డాక్టర్స్ టీ -20 క్రికెట్ ప్రీమియర్ లీగ్ లోగోను ఆవిష్కరిస్తున్న టోర్నీ ప్రతినిధులు

కొండాపూర్, మే 20 : నిత్యం రోగుల సేవల్లో బిజీగా గడిపే వైద్యులకు మానసిక, శారీరక ప్రశాంతతలను అందించేలా డాక్టర్స్ టీ -20 ప్రీమియర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు డ్రీమ్జ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏడీ11 స్పోర్ట్స్, డాక్టర్స్ టీ -20 ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు అనిల్ పెండేలా తెలిపారు. ఆదివారం సాయంత్రం నాలెడ్జ్ సిటీలోని టీ -హబ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లీగ్ లోగోతో పాటు ఏడీ11 జట్టు జెర్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయని, మే 24 నుంచి జూన్ 2వ తేదీ వరకు పోటీలు సాగుతాయని, విజేతకు రూ.2లక్షలు, రన్నర్‌కు రూ.లక్ష నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ11 జట్టు డైరెక్టర్ అంజలి పెండేలా, డాక్టర్ టీడీఆర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్‌కు వినతి పత్రం అందజేసిన జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్, మే 20 : దేవాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగ సమాఖ్య కార్యాచరణ సమితి ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం రెవెన్యూ అండ్ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్‌ను దేవాదాయ శాఖ జేఏసీ గౌరవ అధ్యక్షుడు గంధం కర్ణాకర్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి, అర్చక అధ్యక్షుడు బద్రీనాథాచార్య, కన్వీనర్ పరశురాం రవీంద్రాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్రం చంద్రశేఖర శర్మ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని జేఏసీ సభ్యులు తెలిపారు.

రెవెన్యూ అండ్ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగ సమాఖ్య కార్యాచరణ సమితి ప్రతినిధులు

సర్కారు బడి బాగుపడేనా..?

'అమ్మ ఆదర్శ కమిటీ' పర్యవేక్షణలో అభివృద్ధి పనులు పూర్తికి చర్యలు

మేడ్చల్, మే20 (నమస్తే తెలంగాణ): సర్కారు పాఠశాలలను బలోపేతం చేసి.. మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర అభివృద్ధి పనులు పూర్తి చేయించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలను నియమించింది. అయితే ఈ కమిటీ పర్యవేక్షణలో పనులు పూర్తయ్యేనా.. అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేలా 12 అంశాలతో కూడిన అభివృద్ధి పనులను 'మన ఊరు-మనబడి' పేరిట ప్రారంభించిన విషయం తెలిసిందే. 505 ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి దశలో 176 పనులకు రూ. 70 కోట్ల నిధులతో పనులు ప్రారంభించింది. పూర్తయిన 30 పాఠశాలలను ప్రారంభించగా, మిగతా 146 స్కూళ్లలో పనులు చివరి దశకు చేరాయి. అయితే ఇంతలోనే ప్రభుత్వం మారడంతో 'మన ఊరు-మన బడి' పనులు మందగించాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' స్థానంలో అభివృద్ధి పనులు జరిపించేలా అమ్మ ఆదర్శ కమిటీలను నియమించింది. ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర అభివృద్ధి పనులు ఈ విద్యా సంవత్సరంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో పనులు చేయించేలా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి రూ. 12 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే అత్యవసర పనులను సంబంధించి కేటగిరీ వారీగా నిధులను ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్, తాగునీటి, మూత్రశాలలు, మరుగుదొడ్లకు ఈ నిధులను వినియోగించుకునే విధంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా పాఠశాలల్లో కనీస అవసరాలు తీర్చాలన్న ఆశయంతో ఏర్పాటైన అమ్మ ఆదర్శ కమిటీ పర్యవేక్షణలో ఏ మేరకు పనులు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

మన ఊరు-మన బడి కార్యక్రమంలో అభివృద్ధి పనులు పూర్తయై ప్రారంభమైన మేడ్చల్ జిల్లా బహదూర్‌పల్లిలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల